# ప్రభుత్వ సర్వీసులో ఏడాది పనిచేయాల్సిందే!



## పీజీ పూర్తిచేసిన డాక్టర్లకు ప్రభుత్వ నిబంధన

**2009-10 బ్యాచ్ నుంచి వర్తింపు**

- పనిచేయనంటే సర్టిఫికెట్లు ఇవ్వరు

**హైదరాబాద్, న్యూస్‌లైన్:** ఇకపై పోస్ట్ గ్రాడ్యుయేట్ పూర్తిచేసిన డాక్టర్లు కూడా ఎంబీబీఎస్ విద్యార్థుల తరహాలోనే ప్రభుత్వ సర్వీసులో ఏడాది పాటు విధిగా పని చేయాలి. లేదంటే వారికి సంబంధిత సర్టిఫికెట్లు ఇవ్వరు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించి త్వరలో ఉత్తర్వులు వెలువడతాయని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వర్గాలు తెలిపాయి. ప్రభుత్వం అధికారికంగా నిర్ణయం ప్రకటించిన వెంటనే అన్ని మెడికల్ కళాశాలలకు ఆదేశాలు జారీ చేస్తామని వెల్లడించాయి. ఎంబీబీఎస్ పూర్తి చేసుకున్న డాక్టర్లు ఏడాదిపాటు గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తేనే పీజీ కోర్సుల్లో ప్రవేశానికి వెయిటేజ్ ఇచ్చేవారు. ఇప్పుడు పీజీ విద్యార్థులకు కూడా ఈ విధానాన్ని వర్తింపజేస్తారు. అయితే పీజీ అనంతరం డాక్టర్లు తాము కోరుకున్న చోట పనిచేసేందుకు వెసులుబాటు కల్పిస్తారు. పీజీ పూర్తి చేసిన డాక్టర్‌కు ఏడాది పాటు నెలకు రూ.25వేలు వేతనంగా చెల్లిస్తారు. ఎంబీబీఎస్ పూర్తిచేసిన వెంటనే పీజీ సీటు వస్తే ఆ కోర్సు పూర్తయిన తర్వాత ఏడాదిపాటు ప్రభుత్వ సర్వీసులో పనిచేయాలి. 2009-10 నుంచి పీజీలో చేరిన వారందరికీ ఇది వర్తిస్తుంది. ఏడాదే కదా.. మొక్కుబడిగా పనిచేస్తే సరిపోతుందనుకుంటే పొరపాటే. ఆ ఏడాది కాలంలో సంతృప్తికరంగా పనిచేశారని ఆస్పత్రి సూపరింటెండెంట్ స్థాయి అధికారి ధ్రువీకరణ పత్రం ఇస్తేనే సర్టిఫికెట్లు ప్రదానం చేస్తారు. రాష్ట్రంలో 900కి పైగా పోస్టుగ్రాడ్యుయేట్ సీట్లు ఉన్నాయి. ఇవి పొందిన వారిలో కనీసం 600 మంది ఉత్తీర్ణులవుతున్నారు. వీరిలో చాలామంది విదేశాలకో లేదా కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉద్యోగాలకో వెళ్లిపోతున్నారు.

**ఎంబీబీఎస్ అభ్యర్థులపై పర్యవేక్షణ ఏదీ?**

ఎంబీబీఎస్ పూర్తయిన వెంటనే గ్రామీణ సర్వీసుల్లో పనిచేయాలన్న నిబంధన నామమాత్రంగా తయారైంది. ఎంబీబీఎస్ పూర్తిచేసినవారిలో చాలామంది హౌస్ సర్జన్ అయిపోగానే రకరకాల కారణాలు చెప్పి సర్టిఫికెట్లు తీసుకుని వెళ్లిపోతున్నారు. మరికొంతమంది పీజీ కోసం విదేశాలకు వెళుతున్నారు. కొంతమంది ప్రభుత్వ సర్వీసుల్లో చేరకుండా క్లినిక్‌లే నడుపుకుంటున్నారు. దీనిపై ఎక్కడా పర్యవేక్షణ లేదు.

03-01-2012 Sakshi